27-04-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## “ మధురమైన పిల్లలారా - మీ ఉన్నతి కొరకు ప్రతి రోజు లెక్కాచారము తీయండి, రోజంతటిలో నడవడిక ఎలా ఉంది? యజ్ఞము పట్ల నిజాయితీ(హానెస్టీ)గా ఉన్నానా? అని పరిశీలించుకోండి. ”

**ప్రశ్న:-** ఏ పిల్లల పట్ల తండ్రికి చాలా గౌరవముంది ? ఆ గౌరవానికి గుర్తులేవి ?

**జవాబు:-** ఏ పిల్లలైతే తండ్రితో సత్యంగా, యజ్ఞము పట్ల నిజాయితీగా ఉన్నారో, ఏదీ దాచరో, ఆ పిల్లల పట్ల తండ్రికి చాలా గౌరవముంది. గౌరవమున్నందు వలన బుజ్జగించి ఉన్నతి చేస్తూ ఉంటారు. సేవ చేసేందుకు కూడా పంపిస్తారు. కాని పిల్లలకు సత్యము వినిపించి శ్రీమతము తీసుకునే తెలివి ఉండాలి.

**పాట:-** సభలో దీపము వెలిగింది,....................(మెహఫిల్ మే జల్ ఉఠీ శమా,................)

ఓంశాంతి. ఈ పాట తప్పు, ఎందుకంటే మీరు దీపాలు కారు. వాస్తవానికి ఆత్మను దీపమని అనరు. భక్తులు అనేక పేర్లు పెట్టేశారు. తెలియనందువలన, 'నేతి-నేతి' మాకు తెలియదు, (తెలియదు, కాదు-కాదు) అని అంటారు కూడా. అందరూ నాస్తికులే. అయినా ఏ పేరు నోటికి వస్తే ఆ పేరుతో పిలుస్తారు. బ్రహ్మను దీపమంటారు. అంతేకాక రాయి-రప్పలలో కూడా పరమాత్మ ఉన్నారని అనేస్తారు ఎందుకంటే భక్తిమార్గములో ఎవ్వరూ తండ్రిని యథార్థంగా తెలుసుకోలేరు. తండ్రే స్వయంగా వచ్చి తమ పరిచయమునివ్వవలసి వస్తుంది. శాస్త్రాలు మొదలైనవాటిలో దేనిలోనూ తండ్రి పరిచయము లేదు. అందువలన వారిని నాస్తికులని అంటారు. ఇప్పుడు పిల్లలకు తండ్రి స్వయంగా తమ పరిచయమునిచ్చారు, కాని **స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేయడంలోనే బుద్ధికి పని (వివేకము) ఉంది.** ఈ సమయంలో అందరూ రాతి బుద్ధి గలవారిగా ఉన్నారు. బుద్ధి ఆత్మలో ఉంది. అవయవాల ద్వారా ఆత్మలోని బుద్ధి స్వచ్ఛంగా, బంగారు బుద్ధిగా ఉందా? లేక రాతిబుద్ధిగా ఉందా? అని తెలుస్తుంది. ఆధారమంతా ఆత్మ పైననే ఉంది. మనుష్యులేమో ఆత్మయే పరమాత్మ అని, ఆత్మ నిర్లేపి అని అంటారు. కనుక ఏది కావాలంటే అది చేస్తూ ఉండండి అని చెప్తారు. మనుష్యులై ఉండి, తండ్రి ఎవరో తెలియదు. తండ్రి చెప్తున్నారు - మాయా రావణుడు అందరి బుద్ధిని రాతిబుద్ధిగా చేసేశాడు. రోజురోజుకు తమోప్రధానత ఎక్కువవుతూ ఉంది. మాయ జోరు ఎక్కువగా ఉంది. బాగుపడరు. రాత్రిపూట రోజంతటి లెక్కాచారాన్ని చూచుకోండి - ఈ రోజు నేనేం చేశాను? భోజనము దేవతల వలె తిన్నానా? నియమానుసారము నడుచుకున్నానా? లేక తెలివిహీనుల వలె నడుచుకున్నానా? ప్రతి రోజు మీ లెక్కాచారాన్ని సంభాళించుకోకుంటే (సరి చేసుకోనిచో) మీ ఉన్నతి ఎప్పుడూ జరగదు. చాలా మందిని మాయ చెంపదెబ్బలు కొడ్తూ ఉంటుంది. ఈ రోజు నా బుద్ధియోగము ఫలానావారి నామ-రూపాలలోకి వెళ్ళింది, ఈ రోజు ఈ పాప కర్మ జరిగింది............... ఇలా సత్యము వ్రాయువారు కోటిలో కొంతమంది మాత్రమే ఉన్నారు. తండ్రి చెప్తున్నారు - నేను ఎవరో, ఎలా ఉన్నానో అని నన్ను గురించి తెలియనే తెలియదు. స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రిని స్మృతి చేసినప్పుడే కొంతైనా బుద్ధిలో కూర్చుంటుంది. తండ్రి చెప్తున్నారు - భలే చాలా మంచి-మంచి

పిల్లలున్నారు, జ్ఞానము చాలా బాగా వినిపిస్తారు. కాని యోగము కొంచెం కూడా లేదు. నా గుర్తింపు లేనే లేదు. అర్థము చేసుకోలేరు. అందుకే ఎవ్వరికీ అర్థం చేయించలేరు. ప్రపంచములోని మనుష్యులెవ్వరికీ, రచయిత-రచనల గురించి తెలియనే తెలియదు అనగా ఏమీ తెలుసుకోనట్లే. ఇది కూడా డ్రామాలో నిర్ణయమయ్యే ఉంది. మళ్లీ ఇలాగే జరుగుతుంది. 5 వేల సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ సమయము వస్తుంది. నేను వచ్చి మళ్లీ అర్థం చేయించవలసి వస్తుంది. రాజ్యాధికారము తీసుకోవడం చిన్న విషయము కాదు. చాలా కష్టము. మాయ చాలా దాడి చేస్తుంది. యుద్ధము చాలా జరుగుతుంది. మల్లయుద్ధము (బాక్సింగ్) చూశారు కదా. చాలా తెలివిగల వారే మల్లయుద్ధము చేస్తారు. అయినా అందులో ఒకరినొకరు స్పృహ తప్పునట్లు మల్లయుద్ధము చేస్తారు కదా. బాబా! మాయ తుఫానులు చాలా వస్తున్నాయని చెప్తారు. ఇలా సత్యము వ్రాసేవారు కూడా చాలా కొద్దిమంది మాత్రమే. దాచి పెట్టేవారు చాలా మంది ఉన్నారు. నేను బాబాకు సత్యమునెలా వినిపించాలి? ఏ శ్రీమతము తీసుకోవాలి? అను తెలివే లేదు. వర్ణించలేరు. మాయ చాలా శక్తివంతమయిందని తండ్రికి తెలుసు. సత్యము చెప్పేందుకు చాలా సిగ్గుపడ్తారు. వారి ద్వారా ఎటువంటి కర్మలు జరుగుతాయంటే అవి తెలిపేందుకు వారు సిగ్గుపడ్తారు. తండ్రి ఏమో చాలా గౌరవిస్తూ వారిని పైకి ఎత్తుతారు(ఉన్నతి చేస్తారు). వీరు ఎంతో మంచివారు, వీరిని ఆల్‌రౌండు సేవకు పంపుతానని అంటారు. ఈ మాటలు విని దేహ-అహంకారము వస్తే , మాయతో చెంపదెబ్బ తింటారు, క్రింద పడిపోతారు, బాబా వారిని పైకి ఎత్తేందుకు మహిమ కూడా చేస్తారు. మీరు చాలా మంచి పిల్లలు, స్థూల సేవ కూడా బాగా చేస్తారు అని బుజ్జగించి పైకి ఎత్తుతారు. కానీ గమ్యము చాలా గొప్పదని యథార్థము తెలుపుచున్నారు. దేహము, దేహ సంబంధాలన్నీ వదిలి స్వయాన్ని అశరీరి ఆత్మగా భావించండి - ఈ పురుషార్థము బుద్ధి చేసే పని. అందరు పురుషార్థులే. ఎంత గొప్ప సామ్రాజ్యము స్థాపనవుతూ ఉంది! తండ్రికి అందరూ పిల్లలే కాక విద్యార్థులు కూడా. అంతేకాక అనుచరులు (ఫాలోయర్స్) కూడా, వీరు మొత్తం ప్రపంచానికంతా తండ్రి. అందరూ వారినొక్కరినే పిలుస్తారు. వారు వచ్చి పిల్లలకు అర్థం చేయిస్తూ ఉంటారు. అయినా వారి పై అంత గౌరవముండదు. పెద్దవారు వచ్చినప్పుడు వారికెంతో గౌరవమిచ్చి వారిని సంభాళన చేస్తారు. వారికి ఎంతో ఆడంబరముంటుంది. ఈ సమయంలో అందరూ పతితులే. కాని స్వయాన్ని పతితులుగా భావించరు. మాయ పూర్తిగా తుచ్ఛబుద్ధిగా తయారు చేసేసింది. సత్యయుగం ఆయువు చాలా ఎక్కువని చెప్తారు. ఇది వంద శాతము బుద్ధిహీనత అని తండ్రి చెప్తారు. మనుష్యులుగా ఉండి ఎలాంటి కర్మలు చేస్తారో చూడండి. 5 వేల సంవత్సరాలకు బదులు లక్షల సంవత్సరాలని అనేశారు. ఇది కూడా తండ్రి వచ్చి తెలియజేస్తున్నారు. 5 వేల సంవత్సరముల క్రితము ఈ లక్ష్మీనారాయణుల రాజ్యముండేది. వారు కూడా మనుష్యులే. అయితే దైవీగుణాలు గలవారు. అందుకే వారిని దేవతలని అంటారు. ఆసురీ గుణాలు గలవారిని అసురులని అంటారు. అసురులకు దేవతలకు రాత్రికి పగలుకున్నంత తేడా ఉంది. ఎన్ని మారణహోమాలు, కొట్లాటలు జరుగుచున్నాయి! అనేక ఆయుధాలు తయారవుతూ ఉంటాయి. ఈ యజ్ఞములో మొత్తం ప్రపంచమంతా స్వాహా అవుతుంది. అందుకు ఈ ఏర్పాట్లన్నీ కావాలి కదా. బాంబులు తప్పకుండా వేసుకుంటారు. బంద్ అవ్వజాలదు. కొద్ది సమయములోనే అందరి వద్దా ఎన్నో లెక్కలేనన్ని బాంబులు తయారవుతాయి. ఎందుకంటే వినాశనమైతే వేగవంతంగా(ఫటాఫట్‌గా)

జరగాలి కదా. అప్పుడు ఆసుపత్రులు మొదలైనవేవీ ఉండవు. ఎవ్వరికీ అర్థము కూడా కాదు. పిన్నమ్మ ఇల్లేమీ కాదు. వినాశన సాక్షాత్కారము చిన్న విషయము కాదు. పూర్తి ప్రపంచానికి అంటుకునే అగ్నిని మీరు చూస్తారు. ఎక్కడ చూసినా అగ్నియే అగ్ని ఉంటుంది. ఇది ఎంత పెద్ద ప్రపంచము. ప్రపంచమంతా సమాప్తమైపోతుంది. ఆకాశమైతే కాలిపోదు. దీనిలో ఏమేమి ఉందో అంతా వినాశనమైపోతుంది. సత్యయుగానికి కలియుగానికి రాత్రికి-పగలుకున్నంత వ్యత్యాసముంది. లెక్కలేనంతమంది మనుష్యులున్నారు, జంతువులున్నాయి. ఎంత సామగ్రి ఉంది! ఇది కూడా పిల్లల బుద్ధిలో కష్టంగా కూర్చుంటుంది. ఇది 5 వేల సంవత్సరాలనాటి విషయము. కొద్దిగా ఆలోచించండి. దేవీ దేవతల రాజ్యముండేది కదా. అప్పుడు చాలా కొద్ది మందే మనుష్యులుండేవారు. ఇప్పుడెంతమంది మనుష్యులున్నారు! ఇది కలియుగము. ఇప్పడిది తప్పకుండా వినాశనమవుతుంది.

ఇప్పుడు తండ్రి ఆత్మలకు చెప్తున్నారు - నన్ను ఒక్కరినే స్మృతి చేయండి (మామేకం యాద్‌కరో) ఇది కూడా అర్థము చేసుకొని స్మృతి చేయాలి. కేవలం శివ-శివ అని చాలా మంది అంటూ ఉంటారు. చిన్న పిల్లలు కూడా అంటారు. కాని బుద్ధిలో జ్ఞానము ఏమాత్రము ఉండదు. వారు బిందువని అనుభవంతో చెప్పరు. ఊరకే అంటారు. మనము కూడా చాలా చిన్న బిందువులమే. ఇలా అర్థము చేసుకొని జ్ఞానయుక్తంగా స్మృతి చేయాలి. మొదట నేను ఆత్మను అని పక్కా చేసుకోండి. తర్వాత తండ్రి పరిచయాన్ని బుద్ధిలో బాగా ధారణ చేయండి. అంతర్ముఖులుగా ఉన్న పిల్లలే మేము ఆత్మలము, బిందువులము అని బాగా అర్థము చేసుకోగలరు. ఇప్పుడు మన ఆత్మలకు, మనలో 84 జన్మల పాత్ర ఎలా నిండి ఉందో, మళ్లీ ఆత్మ సతోప్రధానంగా ఎలా అవుతుందో ఇప్పుడా జ్ఞానము లభిస్తూ ఉంది. ఇవన్నీ చాలా అంతర్ముఖులుగా ఉండి అర్థము చేసుకునే విషయాలు. ఇందులోనే సమయం పడ్తుంది. ఇది మన అంతిమ జన్మ అని పిల్లలకు తెలుసు. ఇప్పుడు మనము మన ఇంటికి వాపసు వెళ్తాము. మనము ఆత్మలము అని బుద్ధిలో పక్కాగా ఉండాలి. శరీర భావము తక్కువగా ఉన్నపుడే మాట్లాడే తీరులో పరివర్తన కలుగుతుంది. లేనిచో నడవడిక ఇంకా పూర్తిగా చెడిపోతుంది. నీచంగా తయారవుతుంది. ఎందుకంటే శరీరము నుండి వేరుగా అవ్వరు. దేహాభిమానములోకి వచ్చి ఏదో ఒకటి అనేస్తారు. యజ్ఞములో చాలా నిజాయితీగా ఉండాలి. ఇప్పుడింకా చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఆహారపానీయాలు, వాతావరణము కొంచెమైనా చక్కబడలేదు. ఇంకా చాలా సమయము పడ్తుంది. సేవాధారులైన పిల్లలనే బాబా స్మృతి చేస్తారు. పదవి కూడా వారే పొందుకోగలరు. స్వయాన్ని సంతోషపరచుకోవడం, కేవలం శెనగలు తిన్నట్లవుతుంది. ఇందులో చాలా అంతర్ముఖులుగా ఉండాలి. ఇతరులకు అర్థం చేయించే యుక్తి కూడా కావాలి. ప్రదర్శినీలో అందరూ అర్థము చేసుకోలేరు. కేవలం మీ మాటలు బాగున్నాయని అంటారు. ఇక్కడ కూడా నంబరువారుగా ఉన్నారు. మనము తండ్రి పిల్లలుగా అయ్యాము, తండ్రి నుండి స్వర్గ వారసత్వము లభిస్తుందని నిశ్చయమున్నవారు నంబరువారుగా ఉన్నారు. మనము తండ్రి సేవ పూర్తిగా చేస్తూ ఉండాలి. మన పని ఇదే. రోజంతా విచార సాగర మథనము జరుగుతూ ఉంటుంది. ఈ బాబా కూడా విచార సాగర మథనము చేస్తూ ఉంటారు కదా లేకుంటే ఈ పదవి(లక్ష్మీనారాయణుల)నెలా పొందుకుంటారు? పిల్లలకు ఇరువురు (బాప్‌దాదా) కలిసి అర్థము చేయిస్తూ ఉంటారు. రెండు ఇంజన్లు లభించాయి. ఎందుకంటే ఎత్తు చాలా ఉంది కదా. పర్వతాల పైకి వెళ్తున్నప్పుడు రైలు బండికి రెండు ఇంజన్లు తగిలిస్తారు. అప్పుడప్పుడు

వెళ్తూ వెళ్తూ రైలుబండి ఆగిపోతుంది. అప్పుడు జారి క్రిందికి వస్తుంది. పిల్లలైన మన పురుషార్థము కూడా అలా ఉంది. ఉన్నతి చెందుతూ-చెందుతూ శ్రమ చేస్తూ-చేస్తూ పైకి ఎక్కలేరు. మాయా గ్రహణము లేక తుఫాను వస్తూనే పూర్తిగా క్రిందపడి పిండి పిండి అయిపోతారు. కొంచెము సేవ చేసిన వెంటనే అహంకారమొచ్చి క్రింద పడిపోతారు. వారు తండ్రేకాక, ధర్మరాజు కూడా అని మర్చిపోతారు. అటువంటివేమైనా చేస్తే మనకు పెద్ద శిక్షపడ్తుందని మర్చిపోతారు. దీనికంటే వెలుపల ఉండడమే మంచిది. తండ్రికి చెందిన వారిగా అయి వారసత్వము తీసుకోవడం పిన్నమ్మ ఇల్లు కాదు(అంత సులభము కాదు). తండ్రికి చెందిన వారిగా అయి మళ్ళీ అలాంటి పనులు చేస్తే తండ్రి పేరును చెడగొడ్తారు(అవమాన పరుస్తారు). చాలా పెద్ద దెబ్బ తగులుతుంది. వారసులుగా అవ్వడం సులభము కాదు. ప్రజలలో కొంతమంది ఎంత ధనవంతులుగా అవుతారంటే అడగకండి. అజ్ఞాన కాలములో కొంతమంది మంచివారుగా ఉంటారు, కొంతమంది చెడుగా ఉంటారు. అయోగ్య పిల్లలను నా ఎదుట నుండి తొలగిపో, నీ ముఖము చూపించకు అని లౌకిక తండ్రి కూడా అంటాడు. ఇక్కడ ఒకరిద్దరి పిల్లల మాట కాదు. ఇక్కడ మాయ చాలా శక్తివంతంగా ఉంది. ఇందులో పిల్లలు చాలా అంతర్ముఖులుగా ఉండాలి. అప్పుడు మీరు ఎవరికైనా అర్థం చేయించగలరు. అందరూ మీ పై బలిహారమవుతారు. మేము తండ్రిని ఇంతగా తిడ్తూ వచ్చామని చాలా పశ్చాత్తాపపడతారు. సర్వవ్యాపి అని అనడం లేక స్వయాన్ని ఈశ్వరుడని అనేవారికి తక్కువ శిక్షలు పడవు. ఇలాగే ఇంటికి వెళ్లలేరు. వారికింకా చాలా కష్టాలు ఉంటాయి. సమయము వచ్చినపుడు తండ్రి వీరందరితో లెక్క తీసుకుంటారు. వినాశన సమయములో అందరి లెక్కాచారము చుక్తా అవుతుంది కదా. ఇందులో బుద్ధి చాలా విశాలంగా ఉండాలి.

మనుష్యులు ఎవరెవరికో శాంతి బహుమతులనిస్తూ ఉంటారు. వాస్తవానికి శాంతిస్థాపన చేయువారు ఒక్కరే కదా. ప్రపంచములో పవిత్రత-శాంతి-సుఖములు భగవంతుని శ్రీమతమనుసారము స్థాపనవుతూ ఉందని పిల్లలు వ్రాయాలి. శ్రీమతము ప్రసిద్ధి చెందింది. శ్రీమద్భగవద్గీతా శాస్త్రానికి ఎంతో గౌరవమిస్తారు. ఎవరైనా ఎవరి శాస్త్రాన్ని గాని, మందిరాన్ని గాని ఏమైనా చేస్తే ఎంతగా కొట్లాడ్తారు. ఇప్పుడీ ప్రపంచమంతా కాలి భస్మమైపోతుందని మీకు తెలుసు. ఈ మందిరాలు - మసీదులు మొదలైనవాటిని తగులబెట్తూ ఉంటారు. ఇవన్నీ జరగక ముందే పవిత్రంగా అవ్వాలి. సదా ఈ చింత ఉండాలి. ఇల్లు-వాకిళ్లను కూడా సంభాళించుకోవాలి. ఇక్కడికి చాలా మంది వస్తారు. ఇక్కడ మేకల వలె ఉంచుకోరాదు, ఎందుకంటే ఇది అమూల్యమైన జీవితము. వీరిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. పిల్లలు మొదలైన వారిని తీసుకొని రాకూడదు. ఇంతమంది పిల్లలను ఎక్కడుంచి సంభాళిస్తారు? పిల్లలకు శెలవులు వస్తే ఎక్కడికైనా వెళ్తే బాగుంటుందని భావిస్తారు. బాబా వద్దకు మధువనానికి వెళ్తామని అనుకుంటారు. ఇది సత్రము వలె అయిపోతుంది. అప్పుడిది యూనివర్సిటీ ఎలా అవుతుంది! బాబా అంతా పరిశీలిస్తున్నారు. ఎప్పుడూ ఎవ్వరూ పిల్లలను తీసుకు రాకండని ఆర్డరు వేస్తారు. ఈ బంధనము కూడా తగ్గిపోతుంది. మాతల పై జాలి కలుగుతుంది. శివబాబా గుప్తంగా ఉన్నారని కూడా పిల్లలకు తెలుసు. ఇతని పై కూడా కొంతమందికి గౌరవము లేదు. మాకు శివబాబాతో సంబంధముంది కదా? అని భావిస్తారు. ఇతని ద్వారా చెప్పేది శివబాబాయే అని అర్థం చేసుకోరు. మాయ ముక్కుతో పట్టుకొని తప్పుడు పనులు చేయిస్తూ ఉంటుంది. వదలనే

వదలదు. రాజధానిలో అందరూ కావాలి కదా. ఇవన్నీ చివర్లో సాక్షాత్కారమవుతాయి. శిక్షలు కూడా సాక్షాత్కారమవుతాయి. పిల్లలకు మొదలే ఇవన్నీ సాక్షాత్కారమయ్యాయి. అయినా ఏదో ఒక పాప కర్మ చేయడం వదిలి పెట్టరు. చాలా మంది పిల్లలు, మేము మూడవ తరగతికి చెందినవారిగానే అవుతామని కంకణము కట్టుకున్నట్లున్నారు. అందువలన పాపకర్మలు చేయడం మాననే మానరు. వారి శిక్షలను వారే ఇంకా మంచి రీతిగా తయారు చేసుకుంటున్నారు. వారికి అర్థం చేయించవలసి వస్తుంది కదా, మేము థర్డ్‌క్లాసు వారిగానే అవుతామని కంకణము కట్టుకోకండి. ఇప్పుడు మేము ఈ లక్ష్మీ-నారాయణులుగా అవ్వాలని ప్రతిజ్ఞ చేయండి. కొంతమంది మంచి కంకణము కట్టుకుంటారు. ఈరోజు మేము ఏ పాప కర్మ చేయలేదు అని చార్టు వ్రాస్తారు. చాలా మంది ఇటువంటి చార్టు కూడా వ్రాసేవారు. వారు ఈ రోజు లేనే లేరు. మాయ చాలా సతాయిస్తుంది, ఓడిస్తుంది. అర్థకల్పము నేను సుఖమిస్తాను. అర్థకల్పము మాయ దుఃఖమిస్తుంది. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. అంతర్ముఖులుగా అయి శరీర భావానికి అతీతంగా ఉండే అభ్యాసము చేయాలి. ఆహార-పానీయాలు, నడవడికలు చక్కదిద్దుకోవాలి. కేవలం స్వయాన్ని సంతోషపరచుకొని నిర్లక్ష్యముగా ఉండరాదు.
2. చాలా ఎత్తుకు వెళ్ళాలి కనుక చాలా-చాలా హెచ్చరికగా వెళ్ళాలి. ఏ కర్మనైనా చాలా హెచ్చరికతో చేయాలి అహంకారముండరాదు. వ్యతిరేక(ఉల్టా) కర్మలు చేస్తూ శిక్షలను తయారు చేసుకోరాదు. మేము ఈ లక్ష్మీనారాయణుల వలె అయ్యే తీరాలి అని కంకణము కట్టుకోవాలి (ప్రతిజ్ఞ చేసుకోవాలి).

## వరదానము :- " కర్మభోగమనే పరిస్థితి యొక్క ఆకర్షణను కూడా సమాప్తం చేసే సంపూర్ణ నష్టోమోహా భవ "

ఇప్పటి వరకు ప్రకృతి ద్వారా తయారైన పరిస్థితులు మీ అవస్థను తన వైపు ఎంతో కొంత ఆకర్షిస్తున్నాయి. అన్నిటికంటే ఎక్కువగా మీ దేహ లెక్కాచారము మిగిలిపోయిన కర్మభోగం రూపములో వచ్చే పరిస్థితి, తన వైపు ఆకర్షిస్తూ ఉంది. ఎప్పుడైతే ఈ ఆకర్షణ కూడా సమాప్తమౌతుందో అప్పుడు సంపూర్ణ నష్టోమోహా అని అంటారు. ఎటువంటి దేహము లేక దేహ ప్రపంచములోని పరిస్థితి మీ స్థితిని కదిలించరాదు - ఇదే సంపూర్ణ స్థితి. ఎప్పుడైతే ఇటువంటి స్థితి వరకు చేరుకుంటారో అప్పుడు ఒక సెకండులో మీ మాస్టర్ సర్వశక్తివాన్ స్థితిలో సులభంగా స్థితమవ్వగలరు.

## స్లోగన్ :- " పవిత్రతా వ్రతము అన్నిటికంటే శ్రేష్ఠమైన సత్యనారాయణ వ్రతము – ఇందులోనే అతీంద్రియ సుఖము ఇమిడి ఉంది. "